AKSHARA TODAY

అక్షరటుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

28-9-2026 (Monday)

MAIN EDITION

‘యూపీఐ’ ఛార్జీలపై కేంద్రానికి నోటీసులు



అక్షరటుడే, ఢిల్లీ : యూపీఐ లావాదేవీలపై కేంద్ర ప్రభుత్వం ఎండీఆర్ ఛార్జీలు విధించిన విషయం తెలిసిందే. దీనిని సవాల్ చేస్తూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై కేంద్రానికి, ఆర్‌బీఐ, ఎన్‌పీసీఐకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. కేంద్రం నిర్ణయంపై స్టే ఇవ్వాలని పిటిషనర్ వాదించారు. అందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. కొత్త ఫ్రేమ్‌వర్క్‌కు ఆధారాన్ని వివరిస్తూ కేంద్ర ప్రభుత్వం నుండి అఫిడవిట్‌ను కోరింది.

కురాష్‌లో కాంస్య పతకం



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా గేమ్స్‌లో మహిళల 78 కేజీల కురాష్ ఈవెంట్‌లో పింకీ బల్హారా కాంస్యం గెలుచుకుంది. ఆమె తన 2018 ఆసియా క్రీడల ప్రదర్శనను పునరావృతం చేసింది. సోమవారం జరిగిన సెమీఫైనల్స్‌లో దక్షిణ కొరియాకు చెందిన మో సుమిన్‌తో తలపడిన బల్హారా ఓడిపోయింది. ఆమె 0-5 తేడాతో పరాజయం పాలైంది. దీంతో కాంస్య పతకం సాధించింది.

అమెరికాను ముంచెత్తిన నార్‌ఈస్టర్ తుపాన్..



అక్షరటుడే, నేషనల్ డెస్క్: అమెరికా తూర్పు తీరంలో 'నార్‌ఈస్టర్' తుపాన్ తీవ్ర బీభత్సం సృష్టిస్తోంది. దీని ప్రభావంతో న్యూయార్క్, న్యూజెర్సీ సహా పలు ప్రాంతా-ల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షా లు కురుస్తున్నాయి. వాషింగ్టన్ డీసీ నుంచి మైనే వరకు తీర ప్రాంతమంతా తుపాన్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

ఆ మైకుల మోత ఆపండి : అల్లు శిరీష్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : నగరంలో అర్ధరాత్రి వేళల్లో అధిక శబ్దంతో లౌడ్‌స్పీకర్లు, మైకులు వాడుతుండటంపై ప్రముఖ సినీ నటుడు అల్లు శిరీష్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ శబ్ద కాలుష్య సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆయన సోషల్ మీడియా వేదికగా హైదరాబాద్ సిటీ పోలీసులను నేరుగా ట్యాగ్ చేశారు.

వైద్యులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం..



అక్షరటుడే, ఢిల్లీ : వైద్యులపై జరిగే దాడులను ఏమాత్రం సహించబోమని సుప్రీంకోర్టు మరోసారి తేల్చిచెప్పింది. మహారాష్ట్రలో వైద్యులు, సిబ్బందిపై దాడి చేసిన శివసేన (షిండే వర్గం) కార్పొరేటర్ రమేశ్ మాత్రేకు బాంబే హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారం రద్దు చేసింది.



బీజేపీకి తొత్తుగా సీఈసీ

దేశంలో ఓటు చోరీ జరుగుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఎస్ ఐఆర్ ప్రక్రియకు వ్యతిరేకంగా సోమవారం హైదరాబాద్ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఎలక్షన్ కమిషన్ తీరు ఉందని విమర్శించారు. మోదీ అమిత్ షా తీరుతో ప్రపంచ దేశాలు ముక్కున వేలు వేసుకుంటున్నాయన్నారు.

– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

■ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఎన్నికల సంఘం ■ పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ ■ ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలని డిమాండ్

దేశంలో ఓట్ల చోరీతో బీజేపీ గెలుస్తోందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎన్నికల కమిషన్ ఆఫీస్ ముందు ధర్నా చేశారు. అనంతరం ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ.. దేశంలో ఓటర్ల భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ వల్ల బీహార్‌లో ఆర్జేడీ, బెంగాల్‌లో టీఎంసీ ఓడిపోయాయని ఆరోపించారు. ఎలక్షన్ కమిషనర్ తీరుతో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందన్నారు. ఎలక్షన్ కమిషనర్ బీజేపీకి తొత్తుగా మారారని సంచలన వ్యాఖ్యలు చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు..

దేశంలో కొన్నేళ్లుగా 'ఓట్ల చోరీ' జరుగుతోందని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పదే పదే చేసిన హెచ్చరికలు నేడు నిజమని తేలిపోయాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ పునరంకితమై ఉందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని విశ్వసించే రాజకీయ పార్టీలన్నీ విభేదాలను పక్కనపెట్టి కాంగ్రెస్‌తో చేతులు కలపాలని, రాజ్యాంగంపై నమ్మకం లేని వారు మాత్రమే ఈ ఉద్యమానికి దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ప్రతీ పౌరుడికీ వారి ఓటు హక్కు దక్కేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు.

ఢిల్లీకి బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి



అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటన నిమిత్తం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఇవాళ ఉదయం హస్తినకు పయనమయ్యారు. ఈ పర్యటనలో ఆయన పలు కీలక రాజకీయ, పరిపాలనా సంబంధిత కార్యక్రమాల్లో బిజీగా గడపనున్నారు. ఓ ప్రముఖ టీవీ, పత్రికా సంస్థ నిర్వహించబోయే జాతీయ స్థాయి కాంక్లేవ్ కార్యక్రమంలో సీఎం ప్రసంగించనున్నారు. కాంగ్రెస్ సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరు కానున్నారు. పలువురు కేంద్ర మంత్రులను సైతం కలవనున్నారు.

ఈడీ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ధర్నా



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్ నగరంలోని ఈడీ కార్యాలయం ఎదుట ఉద్రిక్తత చోటు చేసుకుంది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈడీ ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈడీ అధికారులు రెండేళ్ల క్రితం పొంగులేటి నివాసాలపై దాడి చేశారు. రెండేళ్లు అవుతున్నా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు నిరసనకు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఈడీ కార్యాలయానికి చేరుకున్నారు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్ట్ చేశారు.

కాల్పుల విరమణ ప్రణాళికను తిరస్కరించిన ట్రంప్



అక్షరటుడే, నేషనల్ డెస్క్ : పశ్చిమాసియాలో యుద్ధాన్ని ముగించే ప్రక్రియను ప్రారంభించడానికి ఇరాన్ ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరస్కరించారు. టెహ్రాన్ ఎక్కువ రాయితీలను డిమాండ్ చేయడమే ఇందుకు కారణమని ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి మైక్ వాల్ట్జ్ తెలిపారు. చర్చలను పునఃప్రారంభించడానికి ముందే ఇరానియన్ ఓడరేవుల వద్ద అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని తొలగించడం, ఆంక్షల నుంచి ఉపశమనం వంటి చర్యలను డిమాండ్ చేశారని వాల్ట్జ్ చెప్పారు. టెహ్రాన్ తన హామీలకు కట్టుబడి ఉంటుందనే నమ్మకం ట్రంప్‌కు లేదన్నారు. దీంతో ఆయన కాల్పుల విరమణ ప్రణాళికను తిరస్కరించాలని చెప్పారు.

ఆసియా క్రీడల్లో సెమీస్‌కు భారత్



అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్: ఆసియా క్రీడల్లో భారత క్రికెట్ జట్టు సెమీస్‌కు చేరుకుంది. సోమవారం అఫ్గానిస్థాన్‌తో భారత్‌కు జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. డ్రా ప్రకారం డైరెక్ట్‌గా క్వార్టర్స్‌కు చేరుకున్న టీం ఇండియా తాజాగా సెమీస్‌కు దూసుకెళ్లింది. రోజంతా వర్షం కురుస్తుండటంతో టాస్ కూడా పడలేదు. దీంతో చాలా సేపు వేచి చూసిన తర్వాత మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. అఫ్గానిస్థాన్ కంటే మెరుగైన ఐసీసీ ర్యాంకింగ్ కారణంగా భారత్ నేరుగా సెమీస్‌కు దూసుకెళ్లింది. అక్టోబర్ 1న సెమీఫైనల్‌లో శ్రీలంక లేదా నేపాల్‌తో భారత్ తలపడుతుంది.



లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో క్లాసులు రద్దు

అక్షరటుడే, పంజాబ్ : పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. 10 రోజుల పాటు యూనివర్సిటీలో తరగతులు రద్దు చేసింది. అంతేగాకుండా మిడ్‌టర్మ్ పరీక్షలను వాయిదా వేసింది. సెప్టెంబర్ 28 నుండి 10 రోజుల పాటు సాధారణ తరగతులు నిలిపి వేస్తున్నట్లు LPU పేర్కొంది. విద్యార్థులు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సైతం యూనివర్సిటీ అనుమతిచ్చింది. దీంతో సోమవారం ఉదయం పలువురు విద్యార్థులు ఇళ్లకు బయలు దేరారు.

తెలంగాణ స్థానికతపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

అక్షరటుడే, హైదరాబాద్ : తెలంగాణలో స్థానికతపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. స్థానికత అంశంపై బెల్లం అంకిత వేసిన పిటిషన్‌ను జస్టిస్ పీఎస్ నరసింహ ధర్మాసనం సోమవారం విచారించింది. స్థానికత కోసం నాలుగేళ్ల విద్యాభ్యాస నిబంధన ఏకపక్షంగా ఉందని పిటిషనర్ వాదించారు. అయితే ఆ వాదనలను కోర్టు తోసిపుచ్చింది. రాష్ట్రపతి ఉత్తర్వులు ప్రకారం తెలంగాణలో కనీసం నాలుగేళ్లు చదివిన వారే స్థానిక రిజర్వేషన్లకు అర్హులని స్పష్టం చేసింది. ఆమె పిటిషన్‌ను కొట్టి వేసింది.





ఉజ్జయినిలో ఉద్రిక్తత

అక్షరటుడే, మధ్యప్రదేశ్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో సోమవారం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రోడ్డు విస్తరణలో భాగంగా షాహీ మసీదులో కొంత భాగాన్ని కూల్చి వేయాలని ప్రతిపాదించారు. దీనిని అడ్డుకోవడానికి పెద్ద ఎత్తున నిరసనకారులు అక్కడకు చేరుకున్నారు. మసీదు వద్దకు ఆదివారం రాత్రి నుంచే పెద్ద సంఖ్యలో నిరసనకారులు చేరుకున్నారు. మసీదును కూల్చకుండా అడ్డుకునేందుకు యత్నించారు. అప్పటికే అక్కడ భారీగా పోలీసులు మోహరించారు. ఆందోళనకారులు పోలీసులపై రాళ్లు విసిరారు. దీంతో నిరసనకారులను అదుపు చేయడానికి పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించారు. అనంతరం లాఠీఛార్జ్ చేశారు.

షూటింగ్‌లో రజతం సాధించిన ఈషా సింగ్

అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : ఆసియా గేమ్స్‌లో భారత ప్లేయర్ ఈషా సింగ్ మహిళల 25 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజత పతకం సాధించింది. ఉత్తర కొరియాకు చెందిన కిమ్ హ్యోన్ సుక్‌తో హోరాహోరీగా సాగిన షూట్‌ఆఫ్‌లలో నెగ్గి ఫైనల్‌కు చేరుకున్న ఈషా.. ఫైనల్లో రెండో స్థానంతో సరి పెట్టుకుంది. మొదట ఆమె చైనాకు చెందిన జియావోతో సమానంగా 38 పాయింట్లు సాధించింది. దీంతో గోల్డ్ మెడల్ కోసం నిర్వహించిన షూట్ అవుట్‌లో ఆమె ఓడిపోయింది. ఫలితంగా రజత పతకంతో సరిపెట్టుకుంది.

